'సనత్‌నగర్'లో ఉత్కంఠ

- ఓయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో కౌంటింగ్..
- విధుల్లో 200 మంది సిబ్బంది..

సనత్‌నగర్, న్యూస్‌లైన్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సికింద్రాబాద్ పార్లమెంట్‌కు సంబంధించి సనత్‌నగర్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ ప్రాంగణంలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో జరగనుంది. ఈ ఎన్నికల్లో నియోజకవర్గానికి సంబంధించి ఫలితం ఎలా ఉంటుందోనని స్థానికులు, రాజకీయనాయకుల్లో ఆసక్తి నెలకొంది. మంగళవారం జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేసే పనిలో అధికార గణం నిమగ్నమైంది. పార్లమెంట్ ఎన్నికల్లో సనత్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 2,53,381 ఓట్లు ఉండగా 1,25,285 (49.45 శాతం) ఓట్లు పోలయ్యాయి. ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లను ఏర్పాటుచేశారు. నియోజకవర్గంలో మొత్తం 229 పోలింగ్‌బూత్‌ల ద్వారా పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. ఆయా పోలింగ్ కేంద్రాల్లో పోలైన అసెంబ్లీ ఓట్ల లెక్కింపునకు గాను కౌంటింగ్ కేంద్రంలో 14 టేబుళ్ల ద్వారా 17 రౌండ్లలో కౌంటింగ్ జరుగుతుంది. 14 టేబుళ్లలో పూర్తిగా 16 రౌండ్లు జరగగా 224 పోలింగ్‌బూత్‌లకు సంబంధించి ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. మిగిలిన ఐదు బూత్‌లకు సంబంధించిన ఓట్ల లెక్కింపు 17వ రౌండ్‌లో ఐదు టేబుళ్ల ద్వారా జరుగుతుంది. సనత్‌నగర్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు నాలుగైదు గంట్లోనే పూర్తయ్యే అవకాశం ఉంటుంది.



సనత్‌నగర్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు జరిగే ఓయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల భవనం

విధుల్లో 200 మంది సిబ్బంది...

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి సనత్‌నగర్ నియోజకవర్గ ఓట్ల కౌంటింగ్ ప్రక్రియకు గాను ఎన్నికల అధికారులు 200 మంది సిబ్బందిని నియమించారు. 14 టేబుళ్లు ఏర్పాటుచేయగా ఒక్కో టేబుల్ వద్ద ముగ్గురు అధికారులు ఉంటారు. కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్‌లు ప్రతి టేబుల్ వద్ద విధులు నిర్వర్తించి కౌంటింగ్ జరుపుతారు. వీరితో పాటు రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, అబ్జర్వర్‌లు, అసిస్టెంట్లు కలుపుకుని 200 మంది విధుల్లో పాల్గొంటున్నారు.

అభ్యర్థుల తరుపున ఏజెంట్లకు అనుమతి...

ఒక్కో టేబుల్ వద్ద ఒక్కో అభ్యర్థికి సంబంధించిన ఏజెంట్‌ను ఓట్ల లెక్కింపునకు పరిశీలించేందుకు అనుమతిస్తారు. వారి సమక్షంలో అధికారులు ఓట్ల లెక్కింపు ప్రక్రియను కొనసాగిస్తారు. ఏ బూత్‌లో ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయో ఈవీఎంలో వచ్చే డిస్‌ప్లేను చూపిస్తారు. ఒకవేళ ఏదైనా బూత్‌లో ఓట్లపై సందేహంగా ఉండి ఏజెంట్లు అభ్యర్థన పెట్టుకుంటే మరోసారి ఈవీఎంను డిస్‌ప్లే చేసి చూపిస్తారు. ఒక్కో రౌండ్‌కు 10–15 నిమిషాల చొప్పున సమయం తీసుకోగా, గంటకు నాలుగు రౌండ్లు లెక్కిస్తారు. అంటే సనత్‌నగర్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు నాలుగైదు గంట్లోనే పూర్తయ్యే అవకాశం ఉంటుంది.

అధిక వేగంతో ప్రాణాలకు ముప్పు

టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

సనత్‌నగర్: ప్రమాదాలు ఉచితం..కానీ అవయవాలు మాత్రం కాదు..సురక్షిత డ్రైవింగ్‌తోనే ప్రాణాలకు రక్ష అని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. టీటీఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఎర్రగడ్డలోని ప్రాంతీయ టెలికాం శిక్షణ కేంద్రం విద్యార్థులకు, సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు–నివారణ అంశంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడుపుతున్న వారిలో ఎక్కువ మంది యువతేనన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడపడం నేరమన్నారు. 2023 సంవత్సరంలో 6,173 మంది, 2024లో 3,300 మంది డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి బేగంపేటలోని టీటీఐలో కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. ముఖ్యంగా యువత ఓవర్ స్పీడ్, రాంగ్‌రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌లు చేస్తున్నారని, రేసింగ్‌లు, స్టంట్లు చేస్తూ తమ విలువైన ప్రాణాలను కోల్పోతూ తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ద్విచక్ర వాహనంపై ట్రిపుల్ రైడింగ్ చేస్తే రూ.1200 వరకు జరిమానా, మూడు నెలలు లైసెన్స్ సస్పెండ్ చేసే అవకాశం ఉంటుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. వాహనాలు నిర్లక్ష్యంగా నడపడం ఎప్పుడూ ప్రమాదకరం అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీవీ సత్యనారాయణ, అడ్మిన్ వివేక్, టీటీఐ సిబ్బంది అయాన్, శ్రీకృష్ణ, హీరో మోటార్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదాలు–నివారణపై అవగాహన కల్పిస్తున్న బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు

అడ్డగుట్ట: బహిరంగ ప్రదేశాల్లో చెత్తా చెదారం వేస్తే జరిమానా విధిస్తామని జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ ఏఎంఓహెచ్ రజినీకాంత్ హెచ్చరించారు. తుకారాంగేట్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగించి శుభ్రం చేశారు. అక్కడ మరెవ్వరూ చెత్త వేయకూడదని ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా ఏఎంఓహెచ్ రజినీకాంత్ మాట్లాడుతూ అనేక ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం ద్వారా రోడ్లన్నీ దుర్గంధంగా తయారవుతున్నాయన్నారు. చెత్తను తమ ఇళ్ల వద్దకు వచ్చే చెత్త తరలింపు స్వచ్ఛ ఆటోల్లోనే వేయాలని అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. అయినప్పటికీ కొందరు రోడ్లపై చెత్త వేసి పోతున్నారని, ఇక నుంచి అటువంటి వారిపై చర్యలు తీసుకొని జరిమానా విధించనున్నట్లు హెచ్చరించారు. ఖాళీ ప్రదేశాల్లో ప్రజలు చెత్త వేయకుండా ఉండేందుకు వినూత్న రీతిలో అవగాహన కల్పించేందుకు అక్కడ ముగ్గులు వేసి శుభ్రంగా ఉంచుతున్నామని తెలిపారు. హైద్రాబాద్ నగరాన్ని అందంగా ఉంచుకునే బాధ్యత ప్రతీఒక్క పౌరుడిపై ఉంటుందని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ అఖిల్, సిబ్బంది టీ. రేణుక, ఎం. రేణుక తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని ముగ్గులు వేసి అవగాహన కల్పిస్తున్న శానిటేషన్ సిబ్బంది

చెత్తను శుభ్రం చేసి క్యారమ్ బోర్డు ఆడి..

బౌద్ధనగర్: రోడ్లపై చెత్త వేయకుండా ప్రజలను చైతన్య పరిచేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు వినూత్న రీతిలో అవగాహన కల్పించారు. నార్త్‌జోన్‌లో మొట్టమొదటిసారిగా బౌద్ధనగర్ డివిజన్‌లో ఇటువంటి ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. జామై ఉస్మానియాలోని ప్రధాన రహదారిలో పేరుకుపోయిన చెత్తను తొలగించి అక్కడ ముగ్గులు వేస్తూ, క్యారమ్ ఆడుతూ గడిపారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయ డిప్యూటీ కమీషనర్ రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించేందుకు తమవంతు కృషిగా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం జామై ఉస్మానియా వద్ద చెత్తతో పేరుకుపోయిన రోడ్లను శుభ్రం చేసి అక్కడ క్యారమ్ బోర్డ్ ఆడుతూ ప్రజలను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాలు, రహదారులలో చెత్త వేయడం సరైంది కాదని, ఇళ్ల వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోల్లోనే చెత్తను వేయాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రజినీకాంత్, శానిటరీ జవాన్ కోడారి రాజు, ఎస్ఎఫ్ఏ శ్రీకాంత్, యాదగిరి, నాగరాజ్, ఆర్పీ అశ్విని తదితరులు పాల్గొన్నారు.



రోడ్లపై చెత్త వేయకుండా క్యారమ్ బోర్డ్ ఆడుతూ అవగాహన కల్పిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరం



ర్యాలీలో పాల్గొన్న 'గాంధీ' సిబ్బంది

గాంధీఆస్పత్రి: పొగాకు ఉత్పత్తుల సేవించడం ఆరోగ్యానికి హానికరమని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గాంధీఆస్పత్రి ప్రాంగణంలో పలు చైతన్య కార్యక్రమాలు, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సూపరింటెండెంట్ రాజారావు మాట్లాడుతు పొగాకు ఉత్పత్తుల సేవనం వలన పలు రోగాలకు గురై ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా సుమారు 60 లక్షల మంది మృత్యువాత పడుతున్నారని, కేన్సర్ మరణాల్లో 50 శాతం పొగాకు సేవించడం వలనే జరుగుగుతున్నాయని వివరించారు. పొగాకులో 60 రకాల కేన్సర్లు కలిగించే నాలుగు వేల రసాయనాలు ఉన్నాయని, సెకెండ్ హ్యాండ్ స్మోక్ కూడా అత్యంత ప్రమాదకరమన్నారు. పొగాకు ఉత్పత్తుల సేవనం వలన పలు రకాల కేన్సర్‌లతోపాటు గుండె, శ్వాసకోశ సంబంధ వ్యాధులు, ఆల్జీమర్, పిల్లలు పుట్టే సామర్థ్యం తగ్గిపోవడం, మధుమేహం తదితర రుగ్మతలు వస్తాయని, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం పొగాకు ఉత్పత్తులు వినియోగించమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఫల్మనాలజీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి, ఆర్ఎంఓ–1 జయకృష్ణ, ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రతినిధి వెంకటరామనర్సయ్య, ఆర్ఎంఓలు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ అధికారులను కించపరిస్తే సహించం



శివారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీ అధికారులను కించపరిస్తే సహించేది లేదని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు జాజుల లింగంగౌడ్ హెచ్చరించారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట బీసీ అధికారులను కించపరిచిన శివారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. 24 గంటలో క్షమాపణ చెప్పకుంటే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గౌడుగు మహేష్‌యాదవ్, శ్రీనివాస్‌ముదిరాజ్, మధు, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.29, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 16, క్యారెట్ 40, దొండ 23, గుండుబీన్స్ 125, గింజ బీక్కుడు 75, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 23, రూట్ రూట్ 17, ఉల్లిగడ్డ 23, ఆలుగడ్డ 32, చామగడ్డ 40, మొరంగడ్డ 28, కందగడ్డ 65, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

డ్రగ్స్ తరలిస్తున్న యువకుల అరెస్ట్



డ్రగ్స్‌తో పట్టుబడ్డ యువకులతో ఎక్సైజ్ సిబ్బంది

అమీర్‌పేట: డ్రగ్స్ విక్రయించేందుకు వెళ్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. అమీర్‌పేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పటేల్ బానోత్ తెలిపిన మేరకు.. ఎక్సైజ్ విభాగం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం 5లో దాడులు నిర్వహించారు. అస్ఫర్ మ్యాన్షన్‌లో సోదాలు చేసి అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం వారి వద్ద విక్రయించడానికి సిద్ధంగా ఉంచిన 11 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు.డ్రగ్‌ను తరలించేందుకు ఉపయోగిస్తున్న ద్విచక్ర వాహనం , ఒక రెడ్‌మీ ఫోన్‌ను సైతం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి షాబాజ్‌ఖాన్, మొహ్మద్ ఆదిల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రియాజ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

పొగాకు ఏ రూపంలో ఉన్నా బ్యాన్ చేయాలి

పంజగుట్ట: ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా 50 లక్షల మంది పొగాకు ఉత్పత్తులవల్ల చనిపోతున్నారని ఇది ఇలానే కొనసాగితే 2030 నాటికి సంవత్సరానికి 80 లక్షలకు పెరిగే అవకాశం ఉందని పలువురు వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ రావూస్ ఓరల్ హెల్త్ ఫౌండేషన్, డాక్టర్ ఒ.నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్, సాయం ఆర్గనైజేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మే 1 నుంచి 31 వరకు పొగాకు వ్యతిరేక మాసోత్సవం ముగింపు కార్యక్రమం శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎ.అశోక్, నిమ్స్ సర్జికల్ అంకాలజీ మాజీ హెచ్ఓడీ డాక్టర్ జి.సూర్యనారాయణ రాజు, ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ ఐ.చిట్టిబాబు, డాక్టర్ ఒ.నాగేశ్వరరావు మాట్లాడాన్నారు. దైవజ్ఞ శర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సాయం ఫౌండేషన్ కో ఫౌండర్ సుధీర్, మ్యూజిక్ డైరెక్టర్ మోహన్, బోగరాజు పాల్గొన్నారు.

నిమ్స్ ఉద్యోగుల సేవలు స్ఫూర్తిదాయకం

లక్డీకాపూల్: ఆస్పత్రికి వస్తున్న రోగులకు ఉద్యోగులు అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప అన్నారు. శుక్రవారం నిమ్స్ ఉద్యోగులు పలువురు ఉద్యోగ విరమణ చెందారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయా ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డైరెక్టర్ పదవీ విరమణ పొందిన ఫైనాన్స్ కంట్రోలర్ శ్రీధర్, ల్యాబ్ అసిస్టెంట్ గిరిధర్, స్టాఫ్ నర్సు తిరుపతమ్మ, సీనియర్ ఫార్మసిస్ట్ ఉషారాణి, ఏసీ మెకానిక్ నాగేశ్వర్ రావ్ సీనియర్ రేడియోగ్రాఫర్ తిరుపతి రావులను ఘనంగా సత్కరించారు.

ముగిసిన స్వచ్ఛ పక్వాడా



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎన్‌టీపీసీ అధికారులు

బన్సీలాల్‌పేట్: కవాడిగూడలోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టీపీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ పక్వాడ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. కార్యక్రమంలో భాగంగా ఎన్‌టీపీసీ నగర వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహించారు. వీధులు, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడానికి వీలుగా వాల్ రైటింగ్, విద్యార్థులకు చిత్రలేఖనం వంటి అనేక కార్యక్రమాలను 15 రోజుల పాటు నిర్వహించారు. స్వచ్ఛ పక్వాడ కార్యక్రమంలో భాగంగా చారిత్రాత్మకమైన చార్మినార్ పరిసర ప్రాంతాలను కూడా ఎన్‌టీపీసీ సిబ్బంది శుభ్రం చేశారు. పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేస్తూ పరిసరాల పరిశుభ్రతపై స్థానికులు, సందర్శలకు ప్లేకార్డుల ప్రదర్శన ద్వారా అవగాహన కలిపించారు. శుక్రవారం ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్‌టీపీసీ అధికారులు ప్రసెన్‌జీపాల్, బీఎస్ రావు, ఎస్ఎన్ ఫాణిగ్రాహి, ప్రియాంక భుయాన్ తదితరులు కలిసి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. చిత్రలేఖనం చక్కని ప్రతిభ కనబర్చిన బోలక్‌పూర్ క్రిష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు అధికారులు బహుమతులను అందజేశారు. అదే విధంగా ఎన్‌టీపీసీలోని పారిశుద్ధ్య సిబ్బందిని కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్‌రెడ్డిలతో పాటు ఎన్‌టీపీసీ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన 'గాంధీ' ఉద్యోగులకు సన్మానం

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో నిరుపేద రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేసిన వారంతా అభినందనీయులేనని సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు అన్నారు. గాంధీఆస్పత్రి వివిధ విభాగాల్లో విధులు నిర్వహించి శుక్రవారం పదవీ విరమణ పొందిన నర్సింగ్ ఆఫీసర్ ప్రశాంతి, నర్సింగ్ ట్యూటర్ యమున, జూనియర్ అసిస్టెంట్ ఎంఏ హఫీజ్, ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్లీ శోభరాణిలకు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. గాంధీఆస్పత్రికి వీరు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. రిటైర్మెంట్ కాలపరిమితి 58 నుంచి 61 ఏళ్లకు పెంచడంతో గత మూడేళ్లుగా ఒక్కరు కూడా పదవీవిరమణ పొందలేదు. ఆర్ఎంఓ–1 జయకృష్ణ, ఏడీ ఫ్లోరెన్స్‌మర్లిన్, ఏఓ సుభాన్, నర్సింగ్ సూపరింటెండెంట్ మంగమ్మలతోపాటు టీఎన్‌జీఓ నాయకులు, సిబ్బంది, పదవీవిరమణ పొందిన ఉద్యోగుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



పదవీవిరమణ పొందిన గాంధీ ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

ఆవిర్భావ వేడుకలు విజయవంతం చేయాలి

లాలాపేట: తెలంగాణ దశాబ్ది ఆవిర్భావ వేడుకల్లో ప్రజలందరూ పాల్గొని ఉద్యమస్ఫూర్తిని చాటాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నం ప్రత్యేక రాష్ట్రం కలను నెరవేర్చిన సోనియా గాంధీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. జూన్ 2న పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న సంబరాలకు తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధినాయకురాలు సోనియా గాంధీ హాజరుకావడం ఎంతో హర్షదాయకం అన్నారు.

ఠాణా భవన నిర్మాణానికి స్థల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

చిలకలగూడ: చిలకలగూడ ఠాణా నూతన భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్నామని ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్ తెలిపారు. గత నెల 23వ తేదిన 'పోలీస్ స్టేషన్‌లో భయం.. భయం.. శిథిలావస్థలో చిలకలగూడ ఠాణా' శీర్షికతో సాక్షి ప్రచురించిన కథనానికి పోలీస్ ఉన్నతాధికారులు స్పందించారు. చిలకలగూడ ఠాణా ప్రాంగణంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశ అనంతరం ఠాణా నూతన భవన నిర్మాణ అంశం ప్రస్తావనకు రాగా సాక్షి ప్రచురించిన క్లిప్పింగ్‌తోపాటు పూర్తి వివరాలను పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్ తెలిపారు. అంబర్‌పేటలో ఈస్ట్‌జోన్ కార్యాలయ నూతన భవనం త్వరలోనే అందుబాటులోకి తెస్తామని, అలాగే చిలకలగూడ ఠాణా నూతన భవనం నిర్మాణం కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని వివరించారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



ప్రకాష్‌నగర్ సెక్షన్ కార్యాలయం ముందు బిందెలతో నిరసనకు దిగిన మహిళలు

సనత్‌నగర్: సరిపడా నీరు ఇవ్వకపోవడంతో మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నామంటూ బేగంపేట ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌కు చెందిన మహిళలు నిరసనకు దిగారు. ప్రకాష్‌నగర్ వాటర్ వర్క్స్ కార్యాలయం ముందు ఖాళీ బిందెలను ప్రదర్శిస్తూ నిరసన ప్రదర్శన కొనసాగించారు. ముఖ్యంగా నీరు లో ప్రెషర్‌తో రావడం వల్ల అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. దీంతో గత్యంతరం లేక తాము ఆందోళనకు దిగాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. వాటర్‌వర్క్స్ సిబ్బంది స్పందిస్తూ ఆ ప్రాంతంలో కొంతమంది మోటార్లు బిగించడం వల్ల నీరు మరికొంతమందికి రావడం లేదని, మోటార్లు బిగించే వారికి జరిమానాలు వేయనున్నట్లు చెప్పారు. తద్వారా నీటి సమస్య లేకుండా చూస్తామని హామీనివ్వడంతో మహిళలు ఆందోళనను విరమించారు.

బాలికతో అసభ్య ప్రవర్తన.. నిందితుడికి మూడేళ్ల జైలు



నిందితుడు నర్సింహ

కంటోన్మెంట్: హాస్టల్‌కు తిరిగి వెళ్లడం ఇష్టం లేక ఇంటినుంచి పారిపోయిన బాలికను బంధించి, అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష పడింది. బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ నారాయణ రెడ్డి, ఎస్ఐ శివశంకర్ తెలిపిన మేరకు.. నాగర్ కర్నూల్‌కు చెందిన ఓ వ్యక్తి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడితో కలిసి కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చి బోయినపల్లి ప్రాంతంలో నివసిస్తున్నాడు. అతని మైనర్ కుమార్తె శంషాబాద్‌లో గురుకుల పాఠశాలలో ఉంటూ చదువుకుంటోంది. 2022 నవంబర్‌లో అనారోగ్యం కారణంగా ఇంటికి వచ్చింది. స్వస్థత చేకూరిన అనంతరం తిరిగి హాస్టల్‌కు తీసుకెళ్తామని తల్లిదండ్రులు చెప్పడంతో డిసెంబర్ 1న ఇంటి నుంచి పారిపోయింది. ఈ క్రమంలో ఇంటికి సమీపంలోని చెట్ల పొదల్లో దాక్కున్న బాలికను గమనించిన స్థానిక పాల వ్యాపారి నర్సింహ (55), బాలికను తన షెడ్డులోకి తీసుకెళ్లాడు. బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాలికను షెడ్డులో బంధించి అక్కడి నుంచి పారిపోయాడు. బాధిత బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, గాలింపు చేపట్టారు. ఆర్ఆర్ నగర్ సమీపంలోని ఓ షెడ్డు నుంచి ఏడుపు వినిపించడంతో బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. బాధిత బాలిక చెప్పిన వివరాల ప్రకారం నిందితుడు నర్సింహను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసును విచారించిన నాంపల్లి 12వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి, నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు, రూ.10వేలు జరిమానా విధించారు.

దోపిడీ గ్యాంగ్.. పైశాచిక ఆనందం

- దాడి చేసి దోపిడీకి పాల్పడిన గ్యాంగ్ అరెస్ట్
- ఇరువురు జువెనల్స్‌తోపాటు ఎనిమిది మంది యువకుల ముఠా
- కత్తులతో బెదిరించి క్షమాపణలు చెప్పించుకుంటారు..
- ఆ వీడియోలను సామాజక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేస్తారు.



చిలకలగూడ : రాత్రి సమయంలో వీధుల్లో తిరుగుతూ ఉంటారు.. తమకు నచ్చనివారు కనిపిస్తే అకారణంగా దాడి చేస్తారు. నగదు, సెల్‌ఫోన్లు లాక్కుంటారు.. కత్తులతో బెదిరించి క్షమాపణలు చెప్పించుకుంటారు. ఆ దృశ్యాలను వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసి పైశాచిక ఆనందాన్ని పొందుతుంటారు. దాడి చేసి దోపిడీకి పాల్పడిన గ్యాంగ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చిలకలగూడ ఠాణా ప్రాంగణంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఎస్‌హెచ్ఓ అనుదీప్, డీఐ రమేష్‌గౌడ్‌లు వివరాలను వెల్లడించారు. సికింద్రాబాద్ వారాసిగూడ, మహ్మద్‌గూడ, అక్బర్‌హోటల్ ప్రాంతాలకు చెందిన మహ్మద్ రహీంబేగ్ (20), మహ్మద్ షేక్‌హుస్సేన్ అలియాస్ సోను (19), మహ్మద్ సమీర్ (20), సయ్యద్ అహ్మద్ పాషా అలియాస్ అఫీర్ (19), మహ్మద్ వసియుద్దీన్ (19) మరో యువకుడు (20)తోపాటు ఇద్దరు మైనర్లు మొత్తం ఎనిమిది మంది ముఠాగా ఏర్పడ్డారు. ఆయా ప్రాంతాల్లో హల్‌చల్ చేస్తు హవా నడిపిస్తున్నారు. గతనెల 28వ తేది రాత్రి 9 గంటల సమయంలో అక్బర్ హోటల్ ప్రాంతానికి చెందిన ఓ యువతి తోటి విద్యార్థులైన పద్మారావునగర్‌కు చెందిన విద్యార్థులు గౌతమ్, రాజ్‌కుమార్‌లతో ఆరుబయట నిలబడి మాట్లాడుతోంది. అదే సమయంలో ముఠా సభ్యులు బైక్‌లపై అటుగా వచ్చి, గౌతమ్, రాజ్‌కుమార్‌లతో అకారణంగా వాగ్వాదానికి దిగారు.

కత్తులతో వెంటాడి....

ఈ క్రమంలో ముఠా సభ్యులు కత్తులు చూపి బెదిరించడంతో భయాందోళనకు గురైన విద్యార్థులు అక్కడి నుంచి పరుగులు తీశారు. బైక్‌లపై వారిని వెంటాడి శ్రీనివాసనగర్ టెంపుల్ ప్రాంతంలో అడ్డగించారు. కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. విద్యార్థుల వద్ద ఉన్న సెల్‌ఫోన్, వెయ్యి రూపాయల నగదు దోచుకుని, పోలీసులకు ఫిర్యాదుచేస్తే చంపేస్తామని బెదిరించారు. దీంతో గౌతమ్ అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల్లో నమోదైన ముఠా సభ్యులు ఆగడాలు, కర్రలతో దాడి, కత్తులతో బెదిరించిన దృశ్యాలు చూసి పోలీసులు అవాక్కయ్యారు. గురువారం రాత్రి వారాసిగూడలో సంచరిస్తున్న మహ్మద్ రహీమ్‌బేగ్, షేక్‌హుస్సేన్, సమీర్, అహ్మద్‌పాషా, వసియుద్దీన్, ఇరువురు జ్యువెనల్స్‌ను అదుపులోకి తీసుకున్నారు. మరో ముఠా సభ్యుడు పరారయ్యాడు. వీరి నుంచి రెండు పదునైన కత్తులు, రెండు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

శిక్ష అనుభవించినా మారలే..

ముఠాకు నాయకత్వం వహించిన మహ్మద్ రహీమ్‌బేగ్ ఓ హత్య కేసులో నిందితుడని పోలీసులు తెలిపారు. ఓ వ్యక్తిపై దాడి చేసి హత్య చేసిన ఘటనలో రహీమ్‌బేగ్ బాల నేరస్తుడని, అప్పటికి అతని వయసు పదహారేళ్లని వివరించారు. జ్యువెనల్ హోంలో శిక్ష అనుభవించిన తర్వాత ప్రవర్తనలో మార్పురాలేదన్నారు. రహీమ్‌బేగ్ సెల్‌ఫోన్, సామాజిక మాధ్యమాల ఖాతాలు పరిశీలించగా విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూసాయి. దాడి చేసి గాయపర్చి, కత్తులతో బెదిరించి సారీ చెప్పించుకోవడం, గుంజీలు తీయించడం వంటి వీడియోలు, కత్తులు, తల్వార్లతో దిగిన ఫొటోలను పోలీసుల స్వాధీనం చేసుకున్నారు.